క్లుప్తంగా

2న మాంసం విక్రయాలు చేపట్టరాదు

ఆదోని అర్బన్: అక్టోబర్ 2న జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆదోని మున్సిపాలిటీ పరిధిలో మాంసం విక్రయాలు చేపట్టరాదని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మటన్, చికెన్ కొట్లతో పాటు హోటళ్లలో నాన్‌వెజ్ వంటకాలు బంద్ చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ



రేషన్ నిల్వలను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: స్థానిక పౌర సరఫరాల గోదామును శనివారం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. గోదాములో ఉన్న రేషన్ నిల్వలు, రికార్డులు, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పౌరసరఫరాల ఉప తహసీల్దార్ వలీబాషా ఉన్నారు.

బహుమతుల పంపిణీ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, పద్యాలాపన, చిత్రలేఖనం వంటి పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పట్టణంలోని నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో శనివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షులు కె.ప్రహ్లాద్, ఉపాధ్యాయులు ప్రసాద్, కళ్యాణి, జాన్ విక్టర్, లోక్యనాయక్, కోటన్న, రేణుక సువర్ణ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో పర్యటన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

మంత్రాలయం: మండల పరిధిలోని రాంపురం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను స్పెషల్ ఆఫీసర్ నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి పరిశీలించారు. నిర్మాణాలకు సంబంధించిన నివేదికలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన ప్రతి ఒక్కరికీ సకాలంలో బిల్లులు చెల్లించడం జరుగుతుందని పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణిమంజరి, ఈఓపీఆర్డీ మణిమంజరి, హౌసింగ్ అధికారులు ఉన్నారు.

డిగ్రీ ప్రవేశాల వెబ్ ఆప్షన్లకు నేడే ఆఖరి రోజు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలి పోయిన సీట్లలో ప్రవేశం కోసం వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవడానికి ఆదివారం ఆఖరి రోజని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చేటప్పుడు ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ఆప్షన్‌గా ఇచ్చుకోవాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న సర్పంచ్ భీమయ్య

మంత్రాలయం: స్థానిక రాఘవేంద్రనగర్‌లో నివాసముంటున్న వెల్డర్ కమలాకర్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి వైఎస్సార్ బీమా నమోదు కావడంతో తక్షణ సాయం కింద శనివారం రూ.10 వేల నగదును సర్పంచ్ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగతా నగదును నామినీ ఖాతాలో జమ అవుతుందన్నారు. అంతకు ముందు వైఎఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి, సభ్యులు మల్లికార్జున.. కమలాకర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తరఫున రూ.10 వేల నగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.



పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం



సురక్ష క్యాంప్‌లో బీపీ చెక్ చేస్తున్న వైద్యాధికారి



ఇస్వీ శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



ఇస్వీలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పప్పుదినుసులు, పండ్లు, ఆకుకూరల స్టాల్

- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్
- ఇస్వీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన
- భారీగా తరలివచ్చి పరీక్షలు చేయించుకున్న ప్రజలు

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



ఇస్వీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్



కౌతాళంలో క్యూ కట్టిన ప్రజలు

ఆదోనిరూరల్: ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. శనివారం మండలంలోని ఇస్వీ గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. భారీగా తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చిన్నపిల్లల వైద్యుడు మహేష్, జనరల్ సర్జన్ వినయ్‌రెడ్డి, పెద్దహరివాణం డాక్టర్ ఇమ్రాన్‌అహ్మద్, పెద్దతుంబళం వైద్యులు నీలోఫర్ పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. అంతకు ముందు ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారన్నారు. గతంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల ఆరోగ్యం కోసం 104, 108 వంటి బృహత్తరమైన కార్యాలను చేపట్టారని, ఆయన అడుగుజాడల్లో ప్రస్తుత ముఖ్యమంత్రిం నడుస్తున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బడాయి దానమ్మ, మాజీ ఎంపీపీ పంపాపతి, స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ గీతావాణి, సర్పంచ్ శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

- ఇస్వీ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది ఏర్పాటు చేసిన ఆకుకూరలు, పప్పుదినుసులు, కొర్రలు, కందులు, వివిధ రకాల పండ్ల స్టాళ్లు ఆకర్షణగా నిలిచాయి.
- **పెద్దకడబూరు:** మండల పరిధిలోని చిన్నతుంబళం సచివాలయం – 2 పరిధిలో శనివారం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందిన లభించింది. స్థానిక డాక్టర్లు సయ్యద్ తాహేర్, సుస్మితతో పాటు కర్నూలు నుంచి జనరల్ ఫిజీషియన్ బాలకృష్ణ, గైనకాలజిస్ట్ కావ్యమేఘన హాజరై వైద్య సేవలు అందించారు. నాగులాపురం, విద్యానగర్, చిన్నతుంబళం గ్రామాల్లో ప్రజలకు రక్త పరీక్ష, బీపీ, షుగర్, మూత్ర, డెంగీ తదితర పరీక్షలు నిర్వహించారు. మెరుగైన చికిత్స అవసరమైన 26 మందిని కర్నూలుకు రెఫర్ చేశారు.
- **కోసిగి:** స్థానిక సచివాలయం -2 పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర నజీర్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఓపీ ద్వారా 367 మంది వైద్య సేవలు పొందారు. నలుగురిని కర్నూలుకు రెఫర్ చేశారు. జగనన్న క్యాంప్‌ను 104 జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళీకృష్ణ సందర్శించారు. క్యాంప్‌లో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రుద్రగౌడ, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, గైనకాలజిస్ట్ మేధా, డాక్టర్లు అభిరూప్, రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి పాల్గొన్నారు.
- **కౌతాళం:** మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూ పాఠశాల ఆవరణంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. వైద్య సేవల కోసం ప్రజలు బారులుతీరారు. డాక్టర్లు ఇమ్మాన్యుయల్, శిరిష తదితరులు ప్రతిఒక్కరికీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. వైద్య శిబిరాన్ని జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఆచార్యులు, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, ఎంఈఓ శోభరాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదచారి పాల్గొన్నారు.
- **మంత్రాలయం:** మండల పరిధిలోని రాంపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు పలువురికి వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ఎంపీపీ వై.గిరిజమ్మ, స్పెషల్ ఆఫీసర్ నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. వైద్య, ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణిమంజరి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ ప్రభావతి, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్‌లు నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, వైద్యాధికారులు వసంతకుమారి, భావన, సురేష్, గోవిందమ్మ, పిల్లల డాక్టర్ మురార్జీ, జనరల్ ఫిజీషియన్ కుమార్‌నాయుడు ఉన్నారు.

ఉచితంగా అద్దాలు ఇస్తామన్నారు



డబ్బులు పెట్టుకుని ప్రయివేట్ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ చేయించుకున్నా. అయినప్పటికీ కళ్లు కనిపించడం లేదు. గ్రామంలో నిర్వహించిన శిబిరంలో చూపించుకున్నా. ఉచితంగా కంటి అద్దాలు ఇస్తామని చెప్పారు. చాలా సంతోషంగా ఉంది.

– ఆనందమ్మ, ఇస్వీ గ్రామం

గ్యాస్‌ట్రబుల్‌తో బాధపడుతుండేవాడిని



కొన్నేళ్లుగా గ్యాస్ ట్రబుల్‌తో బాధపడుతున్నా. ఆస్పత్రిలో చూపించుకునే స్తోమత లేక అలాగే కాలం గడుపుతున్నా. ఈక్రమంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో డాక్టర్ వద్ద చూపించుకున్నా. గ్యాస్ ట్రబుల్‌కు మందులిచ్చారు. కంటి పరీక్ష కూడా చేసి ఉచితంగా కంటి అద్దాలు ఇస్తామన్నారు.

– బుడన్‌సాబ్, ఇస్వీ గ్రామం



కోసిగిలో మందులను పరిశీలిస్తున్న 104 జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళీ కృష్ణ




క్యాంప్‌కు హాజరైన ప్రజలు



రాంపురంలో వైఎస్సార్ కంటి వెలుగు సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ

వాయుపుత్రునికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమం



గాంధీజీ నాటిక డ్యాన్స్‌ను అలరిస్తున్న విద్యార్థినిలు

కోసిగి: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో హెచ్‌ఎం నాగేశ్వరిదేవి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో గాంధీజీ సిద్ధాంతం చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు నినాదంతో ఆటలు, పాటలతో అలరించారు.

విద్యుత్ ప్రమాదాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న డీఈ సుధాకర్



పాల్గొన్న వినియోగదారులు

ఆదోనిఅర్బన్: విద్యుత్ ప్రమాదాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని విద్యుత్‌శాఖ డీఈ సుధాకర్‌కుమార్ అన్నారు. శనివారం విద్యుత్ ప్రమాదాల నివారణపై స్థానిక శ్రీనగర్‌లో విద్యుత్ వినియోగదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన బల్బులనే వాడాలని, విద్యుత్ వాడకాన్ని దుర్వినియోగ పరచకూడదని సూచించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ పురుషోత్తం, ఏఈ నాగభూషణం, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

32 మందికి ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు

ఆదోనిఅర్బన్: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న 32 మందికి హైదరాబాద్ హెటిరోలాబ్ ప్రతినిధులు ఉద్యోగాలు కల్పించారని కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళీమోహన్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారిని శనివారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఏ, బీకామ్, బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన 84 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి 32 మందిని ఎంపిక చేసుకున్నారన్నారు. వీరందరూ అక్టోబర్ 4వ తేదీ లోపు హెటిరో లాబ్ కంపెనీలో జాయిన్ కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆరోగ్య సురక్ష సర్వే

ఆదోని సెంట్రల్: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పట్టణంలో కొనసాగుతోంది. ఎఎన్‌ఎంలు ఆశావర్కర్లు, మెడికల్ స్టూడెంట్స్ కలిసి శనివారం విజయభాస్కరెడ్డి కాలనీలో ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసుకున్నారు.

కౌతాళం: బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో శనివారం చిరుతపల్లి, ఎరిగేరి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను చేపట్టారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్, థైరాయిడ్, గల్ల పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కౌతాళం: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోసిగి సీఐ ఏరిషావలి సూచించారు. పౌరహక్కుల దినోత్సవాన్ని శనివారం మండల పరిధిలోని హాల్వి గ్రామంలో సర్పంచ్ క్రాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల చాలా అనర్థాలు జరుగుతున్నాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డిలు పౌరహక్కుల దినోత్సవం గురించి వివరించారు.

కోసిగిలో చోరీ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని 5వ వార్డులోని నివాసం ఉంటున్న గట్టు వెంకటేష్ ఇంటిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వెంకటేష్ కుటుంబ సమేతంగా రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి షిరిడి సాయిబాబా దర్శనార్థం వెళ్లారు. ఇంటికి రెండు రోజులుగా తాళం వేసిన గమనించిన దొంగలు రాత్రి ఇంటి గేటుకు, తలుపులకు ఉన్న రెండు తాళాలను బద్దలు కొట్టి లోపలి ప్రవేశించి ఇళ్లలోని వస్తువులు చెల్లాచెదురుగా పడివేశారు. ఉదయం కాలనీ వాసులు గేటుకు, ఇంటికి తాళం పగిలి ఉండడం చూసి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. బాధితుడు అక్కడి నుంచే ఫోన్‌లో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటి వద్దకు చేరుకుని లోపలకు ఎవరూ వెళ్లకుండా తాళం వేశారు. బాధితుడు వచ్చాక ఇంటి తలుపులు తెరిచి అందులో ఏయే వస్తువులు చోరీకి గురయ్యాయనేది విచారిస్తామని ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మంత్రాలయం: మండల పరిధిలోని బసాపురం గ్రామానికి చెందిన నరసింహులు (60) రోడ్డు బైక్ అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. శుక్రవారం ఆయన కోసిగి మండలం వందగల్లు గ్రామంలో బంధువుల వద్దకు వెళ్లి రాత్రి బైక్‌పై స్వగ్రామం బసాపురం గ్రామానికి బయలుదేరాడు. ఖగ్గల్–ఐరన్‌గల్లు గ్రామాల మధ్య బైక్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లడంతో కింద పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడే స్పృహతప్పి పడి ఉన్నాడు. ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులు గమనించి 108కు సమాచారం అందించారు. కోసిగి అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గంగమ్మ ఉంది. మాధవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోసిగి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సతీష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్‌లలో మాత్రమే డీడీలు కట్టి ఇసుకను తెచ్చుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఎక్కడ పడితే అక్కడ వంకలు, వాగులలో ఇసుకను తరలిస్తే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

2న రక్తదాన శిబిరం

కోసిగి: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని తలసేమియా బాధితుల సంక్షేమం కోసం ఉచిత రక్త దాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు. తలసేమియా అండ్ సైకిల్ సెల్ సొసైటీ కర్నూలు వారి సౌజన్యంతో కోసిగి కేధారి ల్యాబ్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర ఆధ్వర్యంలో ఉచిత రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలీసులపై టీడీపీ నాయకుల దుర్భాష

- అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహిస్తుండగా అడ్డుకున్న టూటౌన్ సీఐపై బూతు పురాణం
- పది మందిపై కేసు నమోదు



టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట టీడీపీ నాయకులు

ఆదోనిఅర్బన్: టీడీపీ నాయకులు రోజురోజుకు సహనం కోల్పోతున్నారు. తమ నాయకుడు అక్రమాలకు పాల్పడి జైలు పాలు కావడంతో శనివారం మోత మోగిద్దామంటూ ఓ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహిస్తుండటంతో అడ్డుకుని స్టేషన్‌కు తరలించిన పోలీసులను దుర్భాషలాడారు. సీఐ శ్రీనివాస నాయక్ తెలిపిన వివరాలు.. స్థానిక పాత బస్టాండు కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనుమతి లేకుండా పాత బస్టాండు కూడలి నుంచి కోట్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తుండగా విషయం తెలుసుకుని పోలీసులు అక్కడికి చేరేఉరకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, దేవేంద్రప్ప, మరికొంత మంది సహనం కోల్పోయి ఎంతసేపు కూర్చోబెడతావ్, మమ్మల్ని ఎవరనుకున్నావ్ అంటూ సీఐపై దురుసుగా ప్రవర్తించారు. స్టేషన్ ఎదుట భారీగా గుమిగూడిన సిబ్బందిని పోలీసులు చెదరగొట్టారు. ఆ తర్వాత మరింత రెచ్చిపోయిన టీడీపీ నాయకులు సీఐపై బూతు పురాణం అందుకున్నారు. దీంతో పది మంది టీడీపీ నాయకులపై విధి నిర్వహణకు భంగం కలిగించినందుకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినందుకు, అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు, ఘర్షణ వాతావరణం సృష్టించినందుకు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మదిరె భాస్కర్‌రెడ్డి, మాన్వి దేవేంద్రప్పలను అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన 8 మందిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. విచారించి మరికొంతమందిపై కూడా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం



పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న సెబ్ ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్

ఆదోనిరూరల్: అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని, అలాగే కర్ణాటక మద్యం తరలిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని సెబ్ ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ ఆదేశించారు. ఆదోని, కోసిగి, కౌతాళం, ఆలూరు తదితర సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని శనివారం మండలంలోని ఇస్వీ రోడ్డులో రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. అనంతరం ఆదోని సెబ్ స్టేషన్‌లో సీఐలు, ఎస్‌ఐలతో నిర్వహించిన సమావేశంలో సెబ్ ఎస్పీ మాట్లాడారు. ఎన్నికల సమయం దగ్గర పడుతోందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో సిబ్బంది పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్, ఆదోని సెబ్ సీఐ హరికృష్ణ, ఎమ్మిగనూరు సీఐ జయరామ్‌నాయుడు, ఆలూరు సీఐ వెంకట్, కోసిగి సీఐ సృజన్‌బాబు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

ఆదోని సెంట్రల్: విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని జిల్లా సైన్సు కో ఆర్డినేటర్ ఎస్. రంగమ్మ పిలుపు నిచ్చారు. పట్టణంలోని నేషనల్ పాఠశాలలో శనివారం సైన్సు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యం, పర్యావరణం వంటి అంశాలుగా తీసుకొని ప్రాజెక్టులు చేస్తే బాగుంటుందన్నారు. జిల్లా ఎస్‌సీఎస్‌సీ అకాడమిక్ కో ఆర్డినేటర్ హకీమ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేవిధంగా ప్రాజెక్టులను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ ఆదిమూర్తి, రిసోస్ పర్సన్‌లు రంగస్వామి, అమానుల్లా, పుల్లమరాజు, రమణారెడ్డి, ఉస్మాన్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో కర్ణాటక ఉప లోకాయుక్త జడ్జి



జడ్జికి స్వాగతం పలుకుతున్న అధికారులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక ఉప లోకాయుక్త జడ్జి ఫణీంద్ర శనివారం రాత్రి మంత్రాలయం చేరుకున్నారు. వీరికి తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు బొకే అందజేసి స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకోనున్నట్లు అధికారులు తెలిపారు.